

# దయ్యాలు చెప్పిన కథలు

'కౌమ్యశ్రీ'

ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు-ప్రతేక కార్యకలాపాలకు నెలవు-అయిన ఆది వారం. ఆశలు, భయాలు లేనివాళ్ళు హాయిగా నిద్రపోతున్న అర్ధరాత్రి. రాజకీయాలలోని కల్మషంలా కరడు కట్టిన కటిక చీకటి. పదవులు లేని ప్రజా నాయకుల ప్రసంగాలవంటి నక్కల అరుపులు. ఓడిపోయిన పార్టీలాగ దిగాలుపడిన శ్మశానం. జుట్టు విరబోసుకున్న బ్రహ్మ రాక్షసిలా ఉన్న మర్రి చెట్టు. చుక్కలు కనబడనంత దట్టంగా ఉన్నాయి దాని ఆకులు. కబంధుని హస్తాలులా సాగాయి ఊడలు.

మర్రిచెట్టు క్రింద కీచురాళ్ళు గీపెడుతున్నాయి. కప్పలకోసం వెదుకుతున్నాయి త్రాచు పాములు. పాతిపెట్టిన శవాలకోసం గోతులు తవ్వుతున్నాయి నక్కలు. ఒంటరితనానికి బలి అయిన నిర్భాగ్యులను నులుముతోంది చలి.

మనువాకారంలో ఉన్న తెల్లని పొగ గాలిలో తేలుతూ వచ్చి మర్రిచెట్టు క్రింద ఆగింది. క్షణ మాగి చెట్టుమీదకు చూచి కీచు కీచుమని అరిచింది. వెంటనే మరికొన్ని పొగమంచు ఆకారాలు బిలబిలమంటూ చెట్టు దిగి వచ్చాయి. అందులో ఒకటి అడిగింది:

"ఎవరు నువ్వు?"

"దయ్యాన్ని!"

"ఆ సంగతి మాకు తెలుసు. నీ కేకలు విన్నప్పుడే అర్థమయింది నువ్వూ మాలాంటి దయ్యానివే అని! అందుకే చెట్టు దిగి వచ్చాం. నే నడిగింది నీ ఊరు-నీ పేరు."

"ఊరు హైదరాబాదు. పేరు ఆంజనేయులు!"

ఆ మాట వినగానే చెట్టు దిగి వచ్చిన దయ్యా లన్నీ చటుక్కున గాలిలో కెగిరి మాయమయ్యాయి. అవి ఎందుకు వెళ్ళిపోయయో ఆంజనేయులికి తెలుసు. హనుమంతుని పేరు వినబడితే చాలు, దయ్యాలు, భూతాలు హడలెత్తి పారిపోతాయి. అది గ్రహించిన ఆంజనేయులు గరగర మని నవ్వి అన్నాడు:

"నా పేరు ఆంజనేయులే కానీ నేను దయ్యాన్నే! మా అమ్మా, నాన్నా నా కా పేరు ఎందుకు పెట్టారో తెలియదు. మనిషిగా ఉండగా దయ్యా లంటే భయపడేవాడిని. కడకు నేనే దయ్య మయ్యాను. అయినా పేరులో ఏముంది? మహాత్మా గాంధీ పేరు పెట్టుకున్న వా ళ్ళందరు మహాత్ము లయ్యారా? ఈనాడు రామకృష్ణ పరమహంసలు ప్రభుత్వ సారా దుకాణాలముందు పడి దొర్లుతున్నారు. వివేకానందులు, విద్యాసాగరులు దారులు కాచి తలలు గొడుతున్నారు. అనసూయలు, అరుంధతులు బజారులోని అద్దె సెకిళ్ళులా బతకటం లేదూ? భయం లేదు. చెట్టు దిగి రండి."

మాయమైన దయ్యా లన్నీ మళ్ళీ ప్రత్యక్ష మయ్యాయి. ఆంజనేయులువంక పరిశీలనగా చూశాయి. అతని శరీరానికి చర్మం లేదు. ఎముకలు లేవు. గోళ్ళు లేవు. కనుబొమలు లేవు. కళ్ళకు రెప్పలు లేవు. పాదాలు వెనక్కి తిరిగి ఉన్నాయి. ముక్కు లేదు. అక్కడ రెండు రంధ్రాలు మాత్ర మున్నాయి. తనను

> ( ఇవి కేవలం హాస్యంకోసం కల్పించబడిన కథలు. మీ స్వరూప స్వభావాలు కానీ, పేరు, ఉద్యోగం కానీ, డిపార్టుమెంటు కానీ ఇందులో కనబడితే భుజాలు తడుముకోకండి. అవన్నీ మీ పక్క వాళ్ళవిగా భావించి చదువుకోండి —నవ్వుకోండి. అంతే!
>
> \- రచయిత

పరీక్షిస్తున్నారని గ్రహించిన ఆంజనేయులు నోరావలించి చూపించాడు. నోట్లో పళ్ళు లేవు. అతనుకూడా తమలాంటి దయ్యమే అని నమ్మాయి తక్కిన దయ్యాలు. అందులో ఒక ముసలి దయ్యం అంది:

"నీ పేరు పలకటానికే భయంగా ఉందయ్యా!"

"అందుకని-ఇప్పుడు పేరు మార్చుకోమంటావా? మనుషల కైతే ప్రేమలు, పెళ్ళిళ్ళు కావాలి. వేషాలు వెయ్యాలి. మోసాలు చేయలి. వాటికోసం పేర్లు మార్చుకుంటారు. పెంటమ్మలు పద్మప్రియ లైపోతారు. వెర్రియ్యలు విశ్వసుందరరావు లవుతారు. మన కెందు కా పేరుల రిపేరులు?"

"ఎందుకైనా మంచిది! 'అల్లుడూ' అని పిలుస్తాం!"

"నా కభ్యంతరం లేదు. కానీ అదేం పేరు?"

"కొత్తగా వచ్చావు కాబట్టి!"


"అంతేనా? అల్లుళ్ళందరు దయ్యాలనా?"

"మనం కూడా ఒకప్పుడు అల్లుళ్ళమే కదా! అల్లుడు కాకుండా మామలైన వా ళ్ళెవ రున్నారు? అల్లుళ్ళయినా, మామలైనా అందరూ దయ్యాలు కావలసిందే! అది సరే గాని, అల్లుడూ—ఇందాక ఎందు కలా అరిచావు? ఏం కావాలి?"

"అన్నం! ఆకలితో మాడిపోతున్నాను."

"మనుషుల్లాగ మనం దేన్నీ దాచుకోం కదా! ఎప్పుడు కావలసింది అప్పుడే తెచ్చుకుంటాం. మా భోజనా లైపోయాయి. ఈ నిశిరాత్రివేళ అన్నం ఎక్కడ దొరుకుతుంది? డబ్బు, బంగారం లాటివైతే ధనవంతుల ఇళ్ళలో ఎప్పుడు కావాలంటే అప్పుడు దొరుకుతాయి. కానీ ధరలు మండిపోతున్న ఈ రోజుల్లో కలవారి ఇళ్ళలో కూడా అన్నం, కూరలు మిగలటం లేదు. ఈపాటికి హొటల్స్ మూ సేస్తారు."

"కొందరు ధర్మరాజు లింకా క్లబ్బుల్లో ఆడుతుంటారు. దేవదాసులు బార్లలో తాగుతుంటారు. బిల్వమంగళులు సరేసరి! చింతామణి చూరు పట్టుకుని వేలాడుతుంటారు. పాపం! వారి పెళ్ళాలు కంచాల్లో అన్నం పెట్టి ఎదురుచూస్తుంటారు. అటువంటి పతివ్రతల ఇళ్ళలో దొరుకుతుంది అన్నం."



"పతివ్రతలను మోసగించటం పాపం కదూ!"

"అమాయకుల్లా ఉన్నారే! పతివ్రతలను కాకపోతే బరితెగించినదాన్ని మనం కాదు కదా. భగవంతుడు సైతం మోసగించలేడు. అందుకే కదా దేవతలలోని గొప్పవాళ్ళు పతివ్రతలనే మోసగించారుతప్ప బరితెగించిన రంభ లాంటి వాళ్ళ జోలికి పోలేదు."

"రంభ! అంటే ఎవరు?" అడిగిం దొక పిల్ల దయ్యం.

"కుర్ర నన్నా ఇలా ఉన్నావు. నీ కెలా చెప్పాలి? ఆ! రంభంటే దేవలోకంలోని తేనెపట్టు! ఆ పట్టు నెంత పిండినా తేనె తరగదు. ఎవరు పట్టినా ఈగలు కుట్టవు."

పిల్ల దయ్యం అర్థం కానట్టు ఊరుకుంది. గతకాలం అనుభవాలు గురుతుకొచ్చి గుట్టు చప్పుడు కాకుండా ముసిముసి నవ్వులు నవ్వుకుంది ముసలి దయ్యం. ఒక నడివయసు దయ్యం ముందుకు వచ్చి అడిగింది:

"సరే, అల్లుడుగారూ! కూర లేం కావాలి?"

"ఏవైనా ఫరవాలేదు."

"వెజిటేరియనా? నాన్-వెజిటేరియనా?"

"ఈ ప్రశ్న ఎందుకు అడిగావో నాకు తెలుసు."

"ఎందు కడిగాను?"




"చెబుతాను. నీ పే రేమిటి?"

"బాలసుందరం."

"నువ్వు లాయరువా?"

"అవును."

"అందుకే నీ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. వెజిటేరియనా,నాన్-వెజిటేరియనా అన్నావు. వెజిటేరియన్నే అన్నా ననుకో! నాకు రిజర్వేషన్సు లేవని గ్రహించేస్తావు. నాన్-వెజిటేరియన్నే అంటే, వెంటనే రిజర్వేషను ఉందా అంటావు. ఉందంటే ఎంత శాతమంటావు? ఏ గ్రూపంటావు? అవి చెపితే నా కులమేమిటో నువ్వే చెప్పేస్తావు. సూటిగా నీ కుల మేమిటీ అని అడగటం నేరం కాబట్టి డొంకతిరుగుడుగా లాగాలని చూశావు. కుల భేదాలు మన కెందుకురా లాయరుబాబూ?"

"మనుషులకు కులాలు లేవా?"

"లే వంటున్నారుగా నాయకులు!"

"కులాలు లే వంటూనే కులాలవారీగా కాలేజీలు కట్టుకుంటున్నారు. హాస్టల్స్ పెట్టుకుంటున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పదవులు పంచుకుంటున్నారు. ప్రభుత్వం కూడా కులాలవారీగా కాలనీలు కడుతోంది. అంటే? ఒక కులం మరో కులంతో కలవటానికి వీల్లేదనేగా! ఇవన్నీ ఏమిటి మరి?"

"వాళ్ళు మనుషులు! చెప్పినట్టు చేయకూడదు. చే సేది చెప్పకూడదు. మనం దయ్యాలం కదా! వాళ్ళ పోలికలు మన కెందుకు? ఆకలి ఎక్కువగా ఉంది. ఎగిరి ఎగిరి అల ˚సపోయాను. ఇంక ఎగరలేను. తొందరగా వెళ్ళి దొరికింది పట్టుకురా!"

"బాటిల్ కావాలా?"

"వద్దు. అలవాటు లేదు."

"మొగమాట పడకండి, అల్లుడుగారూ! అత్తవారింటిలో అల్లుడు చే సే ఆకతాయి పనులకు అలవాటు అక్కరలేదు. అలవాటు ఉండే కట్నం పుచ్చుకుంటున్నారా? అలవాటు ఉండే కానుకలు కావాలంటున్నారా? గాలికి కొట్టుకుపోయే ఏకులకు అల్లుళ్ళని పేరు పెట్టి అత్తవారింట్లో కూర్చోబెడితే మేకులులాగ బిగి ˚సపోతాయి."

"నిజమేలేవయ్యా."

"అనుమానం వద్దు. బ్రాందీ, వి ˚స్కీలు ఎప్పుడు కావాలన్నా దొరుకుతాయి. కంట్రోలు లేదు. రేషను కార్డు లక్కరలేదు. సులువుగా దొరికేవి అవే!"

"అయినా అటువంటి వన్నీ మనుషులకు గానీ మన కెందుకు చెప్పు? మనుషులైతే దగాలు చేస్తారు. తందనా లాడతారు. ధర్మపత్నులను తన్ని తరిమేస్తారు. వరాయి పడుచులను బలవంతంగా పతితలను చేస్తారు. అటువంటి తప్పుడు పనులు మనం చేయలేం కదా!"

"మనం అన్నం, కూరలు దొంగిలిస్తాం కదా!"

"అంతవరకే! అదైనా ఆకలి తీర్చుకోవటానికే! దాచుకోవటానికి కాదు. మనకు తిండి పెట్టే ఏర్పాటు చే స్తే అదీ చేయం. బతికి ఉన్నవాళ్ళకే తిండి పెట్టలేనివాళ్ళు చచ్చిన వాళ్ళకు పెడతారా? లక్షలు, కోట్లు కూడబెట్టినవాళ్ళు కూడా చచ్చాక మనలాగ అన్నంకోసం అంగలార్చవల ˚సందే! ఇవ్వు డవన్నీ ఎందుకు గానీ ను వ్వెళ్ళిరా!"

బాలసుందరం గాలిలో కెగిరాడు. తక్కిన దయ్యాలన్నీ ఆంజనేయులు చుట్టూ కూర్చున్నాయి. ఆంజనేయులు చలికి వణుకుతున్నాడు. పిల్ల దయ్యాలు ఆకులు, కట్టెలు పోగు పెట్టాయి. ఆడదయ్యాలు నోట్లోనుంచి మంట ఊది అంటించాయి. అందరు చలి కాగుతున్నారు. ముసలిదయ్యం జాలిగా అడిగింది:

"అల్లుడూ! ను వ్వెలా చచ్చిపోయావు?"

"అన్యాయంగానే!"

"డాక్టరు చేతిలోనా?"

"కాదు."

"బ ˜స యాక్సిడెంటా?"

"కాదు."

"రైలు ప్రమాదమా?"

"ఉహూ(! కాదు."

"ఓహో! విమాన మెక్కేటంత పెద్దవాడవా?"

"కాదయ్యా, బాబూ!"

"మరి! హత్యా? ఆత్మహత్యా?"

"అదేదీ కాదయ్యా. అకస్మాత్తుగా రిటైర్‌మెంటు ఇచ్చేశారు కదా! వచ్చే జీతం ఆగిపోయింది. రావల ˚సిన పెన్షను నిలిచిపోయింది. తినటానికి తిండి లేక ఆకలిచావు చచ్చాను."

ముసలిదయ్యం బాధగా నిట్టూర్చింది. గుంపులో నుంచి ఒక వయసుమళ్ళిన దయ్యం లేచింది. నిటారుగా నిలుచుంది. తన ముందు మైక్ లేకపోయినా ఉన్నట్టు, దాన్ని కుడిచేత్తో పట్టుకున్నట్టు అభినయిస్తూ, ఎడమ చేయి ముందుకు చాపి కోపంతో గంభీరంగా అంది—

"సోదర సోదరీమణులారా! ఇతను చెప్పేదంతా పచ్చి అబద్ధం. మన రాష్ట్రంలో ఆకలి చావులు లేనే లేవు. మా ప్రభుత్వాన్ని అపకీర్తి పాలు చేయాలని అపోజిషన్‌వాళ్ళు చెప్పే తప్పుడు మాటలు నమ్మకండి. భూకంపం వచ్చినా, బస్సు బోల్తాపడినా ప్రభుత్వానిదే బాధ్యత అనటం ప్రతిపక్షాలకు అలవా టయిపోయింది. దీనివెనుక కేంద్ర హస్తమో,విదేశీ పాదమో ఉంది. ఇటువంటి తప్పుడు ప్రచారాన్ని నమ్మకండి."

"బాబూ! నువ్వు అధికార పార్టీవాడవా?"

"అవును. బతికుంటే మంత్రి నయ్యేవాడిని."

"మంత్రులైనవాళ్ళు బతకలేక చస్తున్నారు. నువ్వు చచ్చిపోయానని బాధపడుతున్నావు. బెంగ పెట్టుకోకు, నాయనా! నిన్ను మా ముఖ్యమంత్రిని చేస్తాంలే!"

"నిజంగానా?"

"అవునయ్యా! ముఖ్యమంత్రులైన వాళ్ళంతా నీ కన్న గొప్పవాళ్ళా? కంఠం బావుంది. ఇంకేం కావాలి ముఖ్యమంత్రి కావటానికి? అది చాలు! ఇంతకీ నీ పార్టీ ఆదర్శాలేమిటి?"

"నా ప్రభుత్వంలో ఉద్యోగి అనేవా డుండడు. పనులన్నీ ప్రజలే చేస్తారు. ఎవరికీ జీతభత్యా లుండవు. అదే కదా నిజమైన ప్రజా ప్రభుత్వం. నేను ముఖ్యమంత్రి నయ్యాక ఇక ఎన్నికలు లేకుండా చేస్తాం. ఓటు వే సే బాధ ప్రజలకు లేకుండా చూస్తాం."

"బాగుంది. చాలా బాగుంది."

"మరి ఎన్నిక లెప్పుడు?"

"తొందరపడకు. మనకు ఓటర్లు తక్కువ. ఇక్కడున్న మన మొత్తం జనాభా ఒక నియోజకవర్గానికైనా సరిపోదు. మనుషులైతే మనలను కూడా తీసుకుపోయి ఓట్లు వేయించుకోగలరు కానీ, మనం మనుషుల్ని తీసుకురాలేం కదా!"

"మన జనాభా పెంచట మెలా?"

"కాబోయే ముఖ్యమంత్రిలాగే అడిగావు. డాక్టర్లు, ఆర్టీ సి డ్రైవర్లు మన శ్రేయోభిలాషులు కదా! మనం వెళ్ళి వాళ్ళను అవహి స్తే చాలు. వది రోజులలో మన జనాభా పెరిగిపోతుంది. కానీ మరో చిక్కుంది, బాబూ!"

"ఏమి టది?"

"నీ కులంవాళ్ళ ఓట్లు ఎన్ని ఉన్నాయో చూడాలి. జనాభా పెరిగాక వాళ్ళందరు మరో కులం వాళ్ళయితే నీకు చుక్కెదు రవుతుంది. అపోజిషన్ బెంచీలోనైనా నీకు చోటుండదు. ఎన్నిక. లంటూ పెట్టాక కులం తప్పదులే. అందుకని అందరినీ నీ కులం వాళ్ళనే తెచ్చుకోవాలి!"

"ఆఁ! పోనీ ఒక పని చేద్దాం."

"ఏమిటి, నాయనా? చెప్పు."

"ఉన్నవాళ్ళతోనే సరిపెట్టుకుందాం."

"ఎలా?"

"చెట్టు కొక నియోజకవర్గం పెట్టుకుందాం."

"చట్టం ఒప్పుకోవద్దూ?"

"మనుషులు మాటిమాటికీ రాజ్యాంగాన్ని మార్చుకుంటున్నారు. మనం ఎన్నికల చట్టాన్ని మార్చలేమా? అయినా మనుషుల చట్టాలు మన కెందుకు? మన చట్టం మనమే రాసుకుందాం. తెల్లవారేసరికి నేనే రా సేస్తాను."

"నీ పేరేమిటి?"

"తారక మహారాజ్."

"నీకు బొత్తిగా రాజకీయానుభవం లేదనుకుంటాను. ఆవేశపడకు. ఎన్నికలు జరిపించాలంటే ఎన్ని చూడాలి! ప్రతి చెట్టుమీద నీ కులం వాళ్ళెందరున్నారో చూడాలి. నీకు మెజారిటీ వచ్చే చెట్టునే నియోజకవర్గంగా ప్రకటించాలి. అమ్మలక్కల ఆదరణ సంపాదించాలి. అందుకు అబద్ధాలు బాగా చెప్పాలి. నిజంగా ఓట్లు వే సేవాళ్ళు ఆడవాళ్ళే అన్నట్లు, ఇక్కడకు రాకముందు ఏం చే సేవాడివి?"

"నాటకాల్లో వేషాలు వే సేవాడిని!"

" స్టేజిమీద నాటక మాడటం సులువేనయ్యా రాజకీయాల్లో దిగితే నిజ జీవితంలోనే నాటక మాడాలి. ఒక పని చే సేముందు అటువంటి పని ఎన్నడూ జరగదని ప్రకటించాలి. చేయని పనిని చేస్తున్నామని రోజూ చెప్పాలి. మొసలి కన్నీరు కార్చటం నేర్చుకోవాలి. కడివెడు కన్నీరు, బండెడు సానుభూతి రెడీగా ఉంచుకోవాలి. పని జరిగినా, జరగకపోయినా వాగ్దానాలు చేస్తుండాలి. ముఖ్యంగా ఒక పత్రికను పట్టుకోవాలి."


"పత్రికా? ఎందుకు?"

"మన డబ్బా వాయించేవాళ్ళుండాలి కదా!"

"మనది మనం వాయించుకోకూడదా?"

"తప్పు, నాయనా! ప్రజలు నమ్మరు."

"ఏమైనా సరే, వెంటనే ఎన్నికలు జరిపించవల సిందే! నేను ముఖ్యమంత్రిని కావ




ల సిందే! నా కన్న పనికిమాలినవాళ్ళు సైతం మనుషులుగా ఉన్నారు కాబట్టి మంత్రులు, ముఖ్యమంత్రులు అయిపోతున్నారు."

"ఇప్పుడు ఎన్నికలు జరపలేం" అన్నది మరొక దయ్యం.

"ఏం? ఎందుకని?" కోపంగా అన్నాడు తారక మహారాజ్.

"ఇక్కడ మా డిపార్టుమెంటువాడను ఒక్కడనే ఉన్నాను."

"రెవెన్యూ డిపార్టుమెంటా?"

"అవును. మరి కొందరు వచ్చేవరకు ఆగాలి."

"ఉన్నవాళ్ళు సాయపడతారులే!"

"వీల్లేదు. అంతా మావాళ్ళే చేయాలి."

"చచ్చి దయ్యాలైనా మీ బుద్ధులు మారలేదే! మనలో మనం తగువులాడుకోవటానికి మన మిప్పుడు మనుషులం కాదు. ఎన్నికల కన్న ముందుగా సంఘం పెట్టుకోవాలి. సంఘం లేకపోతే బలం రాదు. నాకులాగ పెన్షను రాక దిక్కులేక చచ్చి నట్టవుతుంది."

"నీ పెన్ష నెందుకు రాలేదు?"

"పదేళ్ళముందు—అంటే నేను సర్వీసులో ఉండగా— నా సర్వీసు పుస్తకంలో ఏవో ఎంట్రీలు పడలేదట. రిటైరయ్యేనాటికి బతికి ఉన్నట్టుగా దాఖలా లేదట. నా సర్వీసు పుస్తకంలో ఎంట్రీలు నేను వేసుకోను కదా! ఎప్పుడో, ఎక్కడో, ఎవరో చే సిన లోపాలకు శిక్ష నే ననుభవించాలి."

"తప్పెవరిది? శిక్ష ఎవరికి? అనే న్యాయాన్వయ విచారణ చేయటం వేరే విషయం. సర్వీసు పుస్తకంలో ఎంట్రీలన్నీ ఉంటేగాని ఫించను మంజూరు చేయలేం."

"ఓహో! నువ్వు ఆడిట్ డిపార్టుమెంటు వాడవా?"

"అవును. పెన్ష నివ్వటానికి అన్నీ సరిగా ఉండాలి."

"సరే లేవయ్యా! అడ్డు పెట్టటానికి మీ తరువాతనే ఎవరైనా! కురుక్షేత్ర రణరంగంలో పాండవులకు అడ్డుపడిన సైంధవుడు చచ్చి ఆడిట్ డిపార్టుమెంటుగా అవతరించాడట!"

"సర్వీసులో ఉండగా ఎంత నిలవేశావు?"

"ఏమీ లేదు కానీ, నీది ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంటా?"

"అవును. ఎందుకు?"

"అందుకే అలా అడిగావు. మీ కన్న రాబందులు నయం."

" సెడు బిజినె సలేమీ చేయలేదా?"

"లేదు. కానీ నువ్వు సేల్స్ టాక్స్‌వాడివనుకుంటాను."

"అవును."

"సరేలే! మీకన్న జలగలు నయం!"

"ఎంతవరకు చదువుకున్నావు?"

"ఓహో! నీది ఎడ్యుకేషన్ డిపార్టుమెంటా? ఫొటోగ్రాఫర్లు తలలు మార్చి కథలు మార్చగలరు గానీ, మీరు విద్యార్థుల మార్కులు మార్చి జీవితాలనే మార్చేస్తున్నారు. బాలనాగమ్మను కుక్కగా మార్చిన మాయల ఫకీరు మీ మూ లపురుషుడా ఏం?"

"ఇంతకీ నీ దే డిపార్టుమెంటు, అల్లుడూ?"

"పోలీసు డిపార్టుమెంటు."

దయ్యాలన్నీ గొల్లున నవ్వాయి. విరగబడి నవ్వాయి.నవ్వలేక నవ్వాయి. అందులో ఒక దయ్యం నవ్వాపుకుని గొంతు సవరించుకుని ఎగతాళిగా అంది—

"మీ కీర్తి లోకమంతా వ్యాపించిందిగా! అదిగో! ఆవిడ కాంతామతి! పోలీసు స్టేషనులో చచ్చిపోయింది. ఎందుకో తెలుసా? మానభంగానికి తట్టుకోలేక. అతను పాపారావు. నిర్భయంగా నిజం చెప్పినందుకు పోలీసుల చేతుల్లో చచ్చిపోయాడు. నువ్వా మాకు పేర్లు పెట్టేది?"

"అందరిలాంటి వాడిని కాదయ్యా నేను."

"నేనూ అంతే! ప్రతివాడు అలాగే అంటాడు. ప్రతి డిపార్టుమెంటులోను చెడ్డవాళ్ళతోపాటు మంచివాళ్ళు, నిజాయితీపరులు కూడా ఉంటారు. చెడ్డవాళ్ళను చూచి డిపార్టుమెంటంతా చెడ్డదనటం పొరపాటు."

తర్వాత తగవులు, తగాదాలు చెలరేగేవేమో కానీ బాలసుందరం అన్నం, కూరలు పట్టుకుని రావటంతో ఆ ప్రస్తావన ముగిసిపోయింది. అవురావురుమని తింటున్నాడు ఆంజనేయులు. మనుమల లాగా అన్నంలో కూరలు కలుపుకోవు దయ్యాలు. కొంచెం అన్నం, కొంచెం కూర నోట్లో పెట్టుకుని నమలకుండానే మింగుతాయి. అలాగే తింటున్నాడు ఆంజనేయులు. రెండు ఆడదయ్యాలు కాలువకు వెళ్ళి పైటచెంగుల్లో మంచినీళ్ళు మూటకట్టి తెచ్చాయి. అన్నం తిని, నీళ్ళు తాగి బేవుమని తేన్చి భుక్తాయాసంతో అన్నాడు ఆంజనేయులు—

"రాత్రులు మన మెటూ నిద్రపోలేము కదా! చెట్లెక్కి కూర్చున్నా చల్లని ఆకుల్లో మరీ చలిగా ఉంటుంది. ఎవరైనా కథ చెప్పండి. మంట కాగుతూ వింటాం. కోడి కూసేవేళకు పూర్తవ్వాలి కథ. కోడికూత వినబడితే మనకీ శక్తులూ ఉండవు. రూపాలూ ఉండవు. మీకు తెలుసుకదా!"

"అలా ఎందుకు జరుగుతోంది?" అన్నదొక ఆడదయ్యం.

"ఇంద్రుడు అహల్యను మోసగించినప్పుడు సూర్యుడు కోడి రూపం ధరించి కొక్కొరొకో అని కూశాడంట. వాళ్ళ మోసం గ్రహించి గౌతముడు అహల్యను రాయి కమ్మని శపించాడు."

"అన్యాయం! అందులో అహల్య తప్పేముంది? ఆమె మోసగించబడింది. అన్యాయానికి బలి అయిన నిస్సహాయురాలిమీద జాలి చూపవలసిన భర్త నిర్దాక్షిణ్యంగా శాపం పెట్టాడు. ఇది మగవాళ్ళ నిరంకుశత్వానికి తార్కాణం. కోరి తప్పు చేసిన మగవాడికి మాత్రం శిక్షలేదు."

"ఆవేశపడకు, చెల్లెమ్మా! ఇప్పుడు మనకున్న సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ ఇన్ ఉమన్ అండ్ గర్ల్స్ అనే బ్రోతల్ యాక్టు ప్రకారం వ్యభిచార నేరానికి శిక్ష ఆడదానికే కాని మగాడికి లేదు. ఆక్టులను సృష్టించింది మగవాళ్ళే కదా. నిజంగా ఇది మగవాళ్ళ నిరంకుశత్వమే. కానీ ఆనాడు గౌతముడు ఇంద్రునికూడా శపించాడు. అతనితో బాటు మనందరినీ శపించాడు కోడికూత వినగానే శక్తులు, రూపాలు పోవాలని."

"తప్పు చేసింది దేవతలైతే మన కెందుకు శాపం?"

"తమ్ముడూ! కుర్రకుంకలా మాట్లాడకు. దేవత లెవరు? దయ్యా లెవరు? అంతా ఒకటే! అధికారంలో ఉన్నవాళ్ళను దేవతలంటారు. అపోజిషన్ వాళ్ళను దయ్యాలంటారు."

"తారక మహారాజ్ అధికార పార్టీ కదా! మనలో ఉన్నాడేం?"

"అధికార పార్టీలో అసమ్మతివాదు లుంటారు కదా! అపోజిషన్ వాళ్ళకన్న అసమ్మతివాదులే ఎక్కువగా ప్రమాదకరం. అందుకని వాళ్ళనుకూడా మనలోనే కలుపుతారు."

"నిజమేరా, అప్పా!" అంది ముసలి దయ్యం.

"తాతా! నువ్వెప్పుడైనా అధికార పార్టీలో ఉన్నావా?"

"మొన్న మొన్నటివరకు అధికారం మదే కదా. అప్పటికి నువ్వింకా రాలేదులే! మళ్ళీ మనం అధికారంలోకి వెళితే దేవతల మవుతాం. ఇప్పటి దేవతలు దయ్యా లవుతారు."

"అప్పుడు దేవతలుగా నీతో ఉన్నవాళ్ళందరేరీ?"

"ఇప్పుడు దయ్యా లయ్యారుగా! చెట్టుకొకరు, పుట్టకొకరుగా విడిపోయారు పదవులు లేక. అధికారంలోకి వస్తేగాని అందరు ఒకచోటకు చేరరు."

"సోది ఎందుకు గానీ ఎవరైనా కథ చెప్పండి!"

"ఏం కథ కావాలి, అల్లుడూ?"

"రాజు-రాణి కథలు విన్నాం. యువతీ యువకుల ప్రేమ కథలు చదివాం. దొరల కథలు, దొంగల కథలు తెలుసు. మనుషుల్లో కొందరు అసాధ్యు లుంటారు చూడు—అటువంటివాళ్ళ కథ కావాలి. కోడి కూసే వేళకు పూర్తి కావాలి సుమా! నశేషం, ఇంకా ఉంది వంటి బ్రాటోవర్లు వద్దు. వగలంతా సస్పెన్స్‌తో బాధపడాలి."

"ఎవరు చెపుతారు కథ?"

"నేను చెపుతాను" అంది ఇంజనీరింగ్ డిపార్టుమెంటు దయ్యం.

"నీ పేరేమిటి, నాయనా?"

"కనకాచలం!"

"సరే, చెప్పు."

"మా ఊళ్ళో మంజులరావు అనే ఇంజినీరున్నాడు. లంచం లేకుండా కాగితంమీద కలం పెట్టడు. కాలు కదిపి బయటపెట్టడు. చాలా తెలివైనవాడులే!"

"లంచాలు తీసుకునేవాళ్ళంతా తెలివైనవాళ్ళే!"

"తెలివైనవాళ్ళంతా లంచాలు తీసుకుంటారా?"

"ఇదిగో, లాయరుబాబూ! మాటలు మళ్ళీ విపరీతార్థాలు సృష్టించకు. ప్రమాదం. ఇది న్యాయస్థానం కాదు. అతను చెప్పే కథ విను. ఊ! చెప్పవయ్యా, కనకాచలం."


"అతని హెడ్‌గుమాస్తా భద్రం మరీ తెలివైనవాడు."

"మాగిరిజన రైతు నరహరి పడాల్ కంటేనా? కొమ్ములు తిరిగిన బి. డి. ఓ.ను రిమ్మెత్తిపోయేటట్టు చేశాడు. అతనంటే అందరికీ హడలే" అంది పంచాయతీరాజ్ డిపార్టుమెంటు దయ్యం.

"పార్టీలు మార్చి పదవులు చిక్కించుకుంటారు ప్రజా నాయకులు. అంకెలు మార్చి లాభాలను నష్టాలుగా చూపిస్తారు ఆడిటర్లు. ఏవీ మార్చకుండానే ఒడుపు చూచి పట్టేస్తాడు మా గుమాస్తా గురునాథం. అంత తెలివైనవాడు లేడీ కాలంలో" అన్నది ఇరిగేషన్ డిపార్టుమెంటు దయ్యం.

"మా బ్రేక్ ఇన స్పెక్టర్ నూకరాజును మించినవాడు మళ్ళీ పుట్టడు. నూకరాజు బ్రేక్ కొట్టాడంటే ఎటువంటి వాడైనా బోల్తా పడవలసిందే" అంది ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంటు దయ్యం.

"మా కెరటాల తాశిల్దారు సంగతి మీకు తెలియదేమో! అతన్ని చూచే రాశాడు భర్తృహరి—'తివిరి ఇసుమున తైలమ్ము తీయవచ్చు' అని! ఇసుకలోనుంచే కాదు, రాళ్ళలోనుంచి కూడా రసాన్ని పిండుతాడు మాకెరటల తాశిల్దారు" అంది రెవెన్యూ డిపార్టుమెంటు దయ్యం.




"గంటల గరటయ్య లాంటి తెలివైనవాడు న భూతో న భవిష్యతి! అతనే మనవాళ్ళందరికీ ఆదిపురుషుడు, ఆదర్శపురుషుడు, పితామహుడు" అంది ఎండోమెంట్సు డిపార్టుమెంటు దయ్యం. ముసలి దయ్యం కుతూహలంగా అంది-

"అయితే ఆ కథే చెప్పు!"

"ఎవరా గరటయ్య? ఏ మాకథ?" అన్నాడు ఆంజనేయులు మరింత కుతూహలంగా.

ఎండోమెంట్సు దయ్యం 'గంటల గరటయ్య కథ' చెప్పటానికి చిన్నగా దగ్గి, గొంతుక సవరించుకుంది. మంట చుట్టూ కూర్చున్న దయ్యాలు ఆత్రంగా చూస్తున్నాయి. అంతలో కోడి కూసింది. కోడి కూత వినగానే దయ్యాలన్నీ చటుక్కున గాలిలో కెగిరి మాయమయ్యాయి. చలిమంట వెలుగుతూనే ఉంది.

**(గంటల గరటయ్య కథ—వచ్చే వారం)**